# "తాకితే మూగవాళ్ళు"

౧

వారిలో ఒకఆమెపిల్ల గుండుపొరుగ - బంగారువన్నెతో వెలిగిపోతుంది. పిల్లలకు పిల్లలను చూపించినప్పుడు - హిందూ మహమ్మదీయుల మాదిరి - చేతులు చేతులు కలుపుట అలవాటు. వన్నె, శ్యామలలు చాచుకొన్నచేతులతో ఆహ్వానించుకుంటూ ఉన్నప్పటికీ వకుళ 'మాపిల్లను తాకనివ్వొద్దు' అన్నది.

అవ్వ—ఆపిల్లకు వుండాబూచా? తాకితే ఏం?

వకుళ—మాటలురాని పిల్లలు తాక్కొంటె మూగవాళ్ళవుతారుగా?

అవ్వ—ఆఁ! నిజమే!

వన్నెతల్లి కోరచూపులతో కొంతసేపుంది. కపటపు నవ్వులకు తరుగులేదు—అచట వున్నవారు యీ కపటనాటకమును గమనించలేదు—వూరి అమ్మలక్కల పుట్టు పూర్వోత్తరాలు సిద్ధాంతరాద్ధాంతములుగ వాదించుకొని, సాయంకాలము యెసళ్ళుపెట్టే వేళకు ఇళ్ళకు వెళ్ళారు.

మరునాడు వూరి సుబ్బ వకుళవద్దకువచ్చి 'వన్నెను మీ పిల్లను తాకనివ్వొద్దు అన్నావట నే?' అన్నది.

వకుళ—అవును! మాటలురాని పిల్లలు తాక్కగూడదుగా?

సుబ్బ—'మాపిల్లకంటె వాళ్ళపిల్ల అందగత్తా? వాళ్ళపిల్ల మాపిల్ల అంతయెరుపు ఉందా! ఆపిల్లకి బుజ్జిముక్కు; దొడ్డికాళ్ళు; మాపిల్లతాకితే అవి చక్కనవుతవిగావాల?' అని వెన్నెతల్లి అంటూవుంది.

వకుళ—మాపిల్ల అందగత్తెఅని వారిలో మేము చెప్పలేదు. మాపిల్లను వారి పిల్లవాడికి చేసుకోవద్దులే! నీకు తెలియదటమ్మా! మాటలురాని పిల్లలు తాక్కొంటే మూగివాళ్ళవుతారని?

సుబ్బ—అవును!

వకుళ—అందుకోసమే! అన్నాను. గాని,...మాపిల్ల చక్కని చుక్కని చెప్పలేదే! మొన్న లక్షుమ్మ పిల్ల మాపిల్లను తాకబోతే తాకనివ్వకమ్మ!... మూగివాళ్ళవుతారంది. నేనేమన్న కోపగించుకొన్నానా? వాళ్ళను నేను యేమన్నాను, గనుక యింతరచ్చ చేయటమునకు...

సుబ్బ—పనిపాటలు లేకపోవటమే ...ఇరుగు పొరుగువారితో చెప్పటమే కాదు, వన్నెతండ్రితో ఏం చెప్పిందో చెప్పిందట ఆయన 'మాపిల్లను యెందుకు తాకనివ్వొద్దు? అన్నారు. మమ్మలను యెలిపెట్టినారా? నేనుపోయి అడిగివస్తాను ఉండ' మని బయలుదేరాడట. పెంబడివున్నవారు ఇదియేమంత గొప్పసంగతి. పోయి యేమని అడుగుతావు. మాటలురాని పిల్లలు తాక్కగూడదని నీకుమాత్రం తెలియదా? అంటే ఉగ్రుడైనవాండంతా చల్లబడ్డాడట.

వకుళ—మేము యేమిమాట్లాడినా ఇట్లు పెడఅర్థాలు చేస్తారు. వీరికి చదువువచ్చిఉంటె వ్యంగ్యకవిత్వము వ్రాసి దేశానికిమేలుచేసేవారె! యీ గొడవ నాకెందుకులే! తగులాడుటకు నాకు వోపిక లేదు.

సుబ్బ—డబ్బుగల పిల్లకాయలు ఏమంత అందంగా వున్నారు. పదిమందివాళ్ళను గౌరవిస్తూ చంకకెత్తుకొంటూవుంటే, వారికి రూపముజాస్తి అవుతుంటుంది. కట్నాలుజాస్తియిచ్చి పెళ్ళిళ్ళు చేస్తారుగాన, అప్సరసలుఅని వెంకమ్మఅంది.

వకుళ—యింక యీ విషయము నాతో మాట్లాడవద్దు.

సుబ్బ—పిల్లలను పిల్లలుతాకొంటె యీపిల్ల చస్తుందా? ఆపిల్ల చస్తుందా? అని కామమ్మ అన్నది.

వకుళ—(కళ్ళ నీళ్లుపెట్టుకొంటూ) ఎవరిపిల్లలు చావవద్దు......అందరు చల్లంగా ఉంటేచాలును—తెలివితక్కువగా మూఢాచారమును నేను పాటించినందుకు యింతవచ్చింది. పనిపాటలు లేనివారికి ప్రొద్దుపోవుటెట్లు? దేనికో ఒకదానికి కాలునువ్వుచుండాలి. చదువు సంధ్యలువచ్చి దేశముబాగుపడినా? అర్థములేని మూఢాచారములు పోవాలి. ఒక విషయములో సందేహమువస్తే ముఖాముఖిగ మాట్లాడి తీర్చుకోవాలి. కాని, యిరుగుపొరుగు వాళ్ళ దగ్గర మాట్లాడి గోరంతలు చేసికోకూడదు—

ఇట్లుఅంటూ వకుళ లోపలికివెళ్ళింది.

—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి